# తెగిపోయిన బాంధవ్యం! ×

రచన :
శ్రీ చెంబోలు సోమలింగేశ్వర్.

గణ గణ గణ...మంటూ స్కూలు గంట అదేపనిగా మ్రోగుతోంది. బడి పిల్లలు బిలబిలమంటూ వర్షానికి తడిసి ఎలుకలుమాదిరిగా, ఆతృతగా పరుగెడుతూ, ఒకరి నొకరు తోసుకుంటూ, ఎవరిళ్ళకు వారు వెళ్ళిపోతున్నారు...ఆ స్కూలు ఒక పావుగంటలో నిర్మానుష్యంగా తయారయింది.

ప్రక్కనే గల చిన్న పూలతోటలో తోటమాలి రంగన్న, మొక్కలకు నీళ్ళుపోస్తూ, ఒకసారి తలెత్తి గేటువైపు చూసాడు. మరల తనపనిలో తానునిమగ్నుడై పోయాడు...

రంగన్న ఏభైఏళ్ళ వృద్ధుడు. అయినప్పటికీ, అతనిది దృఢమైన శరీరం. మోకాళ్లవరకు చిన్న పంచెకట్టు. దగ్గరగా యున్న బుంగమీసాలు. అతని చేతిలో ఎల్లపుడు వుండే పొడుగాటి కర్ర. అతని శీవిని వ్యక్తం చేస్తున్నాయ్. ఆ బడిలో చాలకాలం నుండి తోటమాలి పనిచేసి, ఆ తోటను చూసేవాళ్ళకు, ఎంతో హాయిని, ఆహ్లాదాన్ని, కలిగించే విధంగా తయారుచేశాడు. అతనికి బంధువు లంటూ ఎవరూ లేరు. ఒంటరిజీవి. ఆ తోటలోనే ఒక ప్రక్క చిన్న 'పూరిల్లు' కట్టుకొని, నివశిస్తున్నాడు...

ఇంతలో మరల ఒకసారి తలెత్తి గేటువైపు చూసాడు. అతని హృదయం ఆనందంతో నిండిపోయింది! సంతోషంగా ఒక చిరునవ్వు నవ్వాడు...

ఒక యువకుడు గేటుతీసి, అపుడే లోపలకు అడుగు పెట్టి, తోటంతా ఒకసారి కలయజూసాడు. తాతా... అని నెమ్మదిగా పిలిచాడు!...చెట్లు చాటున మొక్కలకు నీరుపోస్తున్న రంగన్న తలెత్తిమానీ,...ప్రకాశం బాబు! వచ్చావా? అంటూ నీళ్ళ కుండను పక్కన పెట్టి ఎంతో ఆప్యాయంగా, తోటలోకి తీసుకెళ్ళాడు. ప్రకాశం ప్రక్కనే యున్న సిమ్మెంటు సోఫామీద కూర్చున్నాడు...బాగుగా అరముగ్గిన అరటి గెల నుండి నాలుగైదు అరటి పళ్లు కోసుకొచ్చి, ప్రకాశం బాబు కిచ్చాడు రంగన్న...

ప్రకాశం బాబు, తోటలోకి ఎపుడు వచ్చినా, ఏవేవో పళ్లు యిచ్చేవాడు. ఆ ప్రకాశంబాబు అంటే తాతకి, ఎంతో ప్రేమ. అలాగునే, ప్రకాశంబాబు' తాత యెడల ఎంతో గౌరవంగా ఉండేవాడు. 'తాత' అంటూ ఎంతో ముద్దుగా పిలుస్తాడు!...అయినా, వీరిద్దరి స్నేహం అంత విచిత్రమైనది...

ఒకనాడు చిన్నతనంలో ఆ బడిలో చదువుతున్నపుడు, ప్రకాశంబాబు ఆ తోటవైపుకు వచ్చి తోటలో ఒకవైపు నున్న ద్రాక్ష పాదును చూసాడు. దానికి పళ్లు గుత్తులు, గుత్తులుగా వ్రేలాడుతున్నాయ్. ఒక రోజున మంచి అదనుచూసి, చప్పుడు కాకుండా తోటలో ప్రవేశించి, ఆ పళ్ళను కోయడం మొదలు పెట్టాడు. ఇది దూరం నుండి రంగన్న చూసాడు. 'ఏయ్...ఎవరది? అని కేకవేసాడు. ఆ కేకతో ప్రకాశం గుండె ధడధడలాడిపోయింది. గాబరాగా పరుగెత్తబోయాడు. కాని, ఆ పరుగులో ద్రాక్షలత కాలికి తగిలి ముందుకు పడ్డాడు. రంగన్న గబగబా వచ్చి, పట్టుకొని, అతని సున్నితమైన చెంపమీద ''ఫెడీ' మని కొట్టాడు. చెంపమీద అయిదు వేళ్ళు అంటుకుపోయాయి...ఆ కుర్రవాడి చంపవైపుచూసి, రంగన్న మనసు ద్రవించిపోయింది. 'అకారణంగా పిల్లవాడిని కొట్టానే' అని మనసు బాధపడింది.చటుక్కున ఆ కుర్రవాడిని దగ్గరకు తీసుకొని, ఏదో ఆకు తెచ్చి, పసురు పిండి, చెంపమీద రుద్దాడు. కొంతసేపటికి వాపు తగ్గిపోయింది. తరువాత తోటలోకి వెళ్ళి, చెట్టునున్న పళ్ళు కోసియిచ్చి, యింటికి పంపివేశాడు. ఈ విధంగా రంగన్న దగ్గర ప్రకాశానికి చనువు ఏర్పడింది. ఈ సంఘటన జరిగి పది పన్నెండేళ్లు అవుతుందేమో!...

* * *

రంగన్న యిచ్చిన అరటిపళ్ళను తింటూ ఆప్యాయంగా, తాతా...లక్ష్మి వచ్చిందా! అని అడిగాడు.

ఆ...ఎవరు బాబూ! ఆ ప్లీడరుగారి అమ్మాయేనా? ...నాల్గురోజులక్రితం వచ్చి, వెళ్ళిపోయింది బాబూ. అని చెప్పాడు....ఏదైనా ఒక విషయం చెప్పాలనుకుంటే, అది ఒక్క రంగన్న తాతతోనే చెప్పేవాడు. ఏదైనా ఒక విషయాన్నిగాని, కోరికలనుగాని, మనసులో వుంచుకొని, బాధపడటం తన కిష్టంలేదు...



మా హృదయపూర్వకమైన అభినందనలు

మీకు కావలసిన....

**1962 కాలండర్లు**

అన్ని రకములలోనూ - అన్ని సైజులలోనూ

సిద్ధముగా ఉన్నవి.

వెంటనే వివరములకు వ్రాయండి.

**SRI KALA TRADERS**

No. 3. Seeni Moonar Street. **SIVAKASI** (S. I)

* ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే *

రంగన్న తాత, తనకు ఆప్తుడిలాంటివాడు. తనమేలు కోరి తగు సలహాలు యిచ్చేవాడు. అటువంటివానికి, తన మనసులోని విషయాలను విప్పిచెప్పేవాడు...

తాతా...అని పిలిచాడు. అప్యాయంగా!

ఏం...బాబూ!...అని ప్రకాశంవైపు చూశాడు, రంగన్న.

తాతా!...యిక నా చదువుకు స్వస్తిచెప్పాలనుకుంటున్నాను. మా నాన్న చనిపోయిన తరువాత, మిగిలిన కొద్దిపాటి ఆస్తి, అప్పులకు, నా చదువుకు హరించిపోయింది. యిపుడు యింటర్ వరకు చదివాను. యింట్లో పరిస్థితులు రోజు-రోజుకు చాలా అధ్వాన్నంగా వున్నాయి. యిప్పటి కర్తవ్యం ఏదైనా చిన్న ఉద్యోగం చేయాలనుకుంటున్నాను...దీనికి నీ సలహా ఏమిటో చెప్పు తాతా? అన్నాడు!...

రంగన్న తాత కండ్లు చెమ్మగిల్లాయి. బాబూ!...యిందులో నేను చెప్పవలసింది ఏమీ లేదు. 'ఉద్యోగం పురుష లక్షణం' 'విద్యఉండి, ఏమీ లేనివారికి అదే జీవనాధారం.'...నీయిష్టప్రకారమే కానియ్యి బాబూ! అదే నాకూ సంతోషం. అని, అన్నాడు...

ప్రకాశం బాబు మౌనంగా ఒక నిట్టూర్పు విడిచాడు. అయితే తాతా!...నీ అంగీకారం కూడ తెల్పావు. చాలా సంతోషంగా యుంది. అని అన్నాడు.

బాబూ!...'కష్టాలు కలకాలం వుండవు' 'సుఖాలే ఎపుడూ మనిషిని అంటిపెట్టుకొని ఉండవు' కష్టకాలాన్నికూడ, ధైర్యంతో ఎదుర్కోవాలి. అలా ఎదుర్కొన్ననాడే, మానవుడు ఈ రెండిటికీ భయపడడు. కష్టాలు వచ్చినా, సుఖాలు వచ్చినా, చిరునవ్వుతో స్వీకరిస్తాడు...నీ మనస్తత్వం పూర్తిగా నాకు తెలుసు. అందుచేత, నీవు దానిగురించి బెంగపడకు. యింటి పరిస్థితులన్నీ చక్కబడగలుగుతాయి. అవి ఎల్లకాలం వుండిపోవుగదా! అని అన్నాడు రంగన్న...ప్రకాశం శ్రద్ధగా వింటున్నాడు. తాత చెప్పిన ఈ మాటలు మనసుకు ఎన్నడులేని వుత్సాహాన్ని కలిగించాయి...'తాతా నీమాట కాదనలేను. ఈ బడిలో చదువుచున్నప్పటినుండి, తల్లితండ్రులకన్నా, బంధువులకన్నా, నేను యిక్కడికెపుడు వచ్చినా, మిక్కిలి ప్రేమతో చూసావు...తాతా!...నిన్ను నా బంధువర్గంలోనివాడని అన్నా అతిశయోక్తి లేదు. మాటలతో నీమనసు నొప్పించగలిగితే నన్ను మన్నించు' అన్నాడు దీనంగా...

ఛ...ఛ...ఎందుకంత ఆశ్చర్యపడతావు బాబూ. నీవెన్నిమాటలన్నా, నామనసుమాత్రం శాంతంగానే యుంటుంది. చనిపోయిన తండ్రిని ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకో బాబూ. ఆయన ధర్మాత్ముడు. తల్లిని జాగ్రత్తగ చూసుకో బాబూ అని అన్నాడు. ప్రకాశం వీపు నిమురుతూ...

తాతా...నీమాట, నేను కాదనలేను. అని మౌనంగా కూర్చున్నాడు.

అప్పుడే ఆకాశంమీద సంధ్యా తారకలు మినుకు మినుకు మంటున్నాయి. చీకటి నల్లరాకాసిలా, కమ్ముకుంటోంది...బాబూ! చీకటిపడుతోంది. రా...బాబు ...వెళ్ళిపోదాం. అని లేచి నిలబడ్డాడు రంగన్న. యిద్దరూ, మౌనంగా గేటువైపు నడిచారు.

తాతా...చాలా పొద్దుపోయింది, నే వెళుతున్నాను. అని అన్నాడు గేటు దాటుతూ....మంచిది బాబూ! జాగ్రత్తగా వెళ్ళు అని రంగన్న గేటుకి తాళంవేసి, ఎదురుగా వున్న కిళ్ళీదుకాణంవైపు నడిచాడు.

* * *

బాబూ!...యింత ఆలస్యమయిందేం? ఎక్కడ కెళ్ళావు బాబూ! అంటూ లాలింపుగా అడిగింది తల్లి...

ఎక్కడికీ లేదమ్మా!...రంగన్న తాతవద్దకు వెళ్ళాను. అని అన్నాడు.

ఊహుఁ...అని దీర్ఘంగా నిట్టూర్చింది. నాయనా! నీ తండ్రి సంపాదించిన కొద్దిపాటి ఆస్తి, నీ చదువుకు, అప్పులకు హరించిపోయింది. మిగిలింది యింకేమీ లేదు బాబూ. ఈ విపరీత పరిస్థితులలో నీ చదువునంతా వినియోగించి ఎక్కడైనా జీవనాధారం చూసి, ఈ కుటుంబ భారాన్ని బరించాలి నాయనా. ఇక నేను ఏమీ చెప్పవలసిందిలేదు. ఈ విషయాన్ని గుర్తుంచుకో బాబూ. అని అన్నది. మరల కొంచెంసేపాగి, బాబూ!...రంగన్న తాత ఏమన్నాడు. అని అడిగింది...

అమ్మా!...నువ్వేమీ విచారించకమ్మా. రంగన్న తాతకూడ మన మేలుకోరే వ్యక్తేనమ్మా...అమ్మా, నీవన్నట్లే, వుద్యోగానికి తప్పక ప్రయత్నం చేస్తానమ్మా. అని, అన్నాడు. కుర్చీలో నుండి లేచి పైనున్న లాల్చీ విప్పి, వంకీ కొయ్యకు తగిలించాడు...

రా...బాబూ...బోజనం చేద్దువునాని, అని వంటింట్లోకి దారితీసింది. ప్రకాశం బాబు మౌనంగా తల్లిని, అనుసరించాడు.

* * *

రెండు వారాలు, చూస్తూండగనే అవలీలగా దొర్లిపోయాయి. ప్రకాశం చేసిన ప్రయత్నం వృధా కాలేదు. వున్నవూరిలోనే వుద్యోగం దొరికింది. ఆరోజు ఉదయం తొమ్మిది గంటలయింది. డ్రెస్సు చేసుకొని, ఆఫీసుకు బయలుదేరాడు. అలా, ఆ త్రోవలోవున్న స్కూలుకు వెళ్ళాడు. క్షణకాలం గేటువద్ద నిలుచున్నాడు. తోటంతా ఒకసారి పరికించి తాతా...అని నెమ్మదిగా పిలిచాడు. కాని, సమాధానం రాలేదు. అతనికి ఆశ్చర్యం వేసింది. మరల తాతా...అంటూ గట్టిగా పిలిచాడు.

సిమెంటు బల్లమీద పడుకున్న రంగన్నతాత, వులిక్కిపడి లేచి, ఏం బాబూ!...అంత తొందరపడుతున్నావ్. అని అన్నాడు...

(తరువాయి 83వ పేజీలో)





ఆంధ్ర మహాశయులకు మా దీపావళి అభినందనలు.

*

కోడి కూతతో – ప్రపంచముదయమవుతుంది.

"కోడి మార్కు" బనియన్లు ప్రపంచ ప్రజలకు ఉత్సాహమునిస్తుంది.

అందానికీ – మన్నికకూ – ప్రసిద్ధిచెందినవి.

— తయారించువారు: —

COCK HOSIERY WORKS

LINE ROAD — GUGAI — SALEM - 1.




నాణ్యమునకూ – నమ్మికకూ ప్రసిద్ధిపొందిన అన్నిరకముల

జంకాళాలు

ఎల్లప్పుడూ ప్రఖ్యాతిగాంచిన మా జంకాళాలు, మరియు బెడ్‌షీట్లనే ఉపయోగించి, ఆనందమునూ, సుఖమునూ పొందండి.

*

ఆంధ్ర ప్రదేశమంతట ఏజెంట్లు కావలెను.

BALAN TEXTILES.
JAMBAI (P.O.)
(via) BHAVANI (S.I.)

బాలన్ టెక్స్‌టైల్స్.
జంబై (P.O.)
(వయా) భవాని (ఎస్. ఐ.)


(10వ పేజీ తరువాయి)

అబ్బే ఏంలేదు తాతా!...అని సోఫా మీద కూర్చుంటూ, నీతో ఒక ముఖ్యవిషయాన్ని చెప్పాలని వచ్చాను. తాతా...చెప్పమన్నావా? అన్నాడు చిరునవ్వుతో. చెప్పకపోయినా పరవాలేదుబాబూ. నీ ముఖంలోకి చూస్తేనే తెలుస్తుంది...అయితే బాబు నీకు వూర్లో వుద్యోగం? అని అడిగాడు...

భలే...చెప్పకుండానే ఊహించావు. ఈ వూరిలోనే వుద్యోగం. అని, నవ్వుతూ, రంగన్న ముఖంలోకి చూసాడు. ఆకస్మాత్తుగా నవ్వు ఆగిపోయింది. ఏం తాతా!...అంత దిగులుగా, నీర్సంగా యున్నావు. అని ప్రశ్నించాడు...

ఏం లేదు బాబూ! రెండు రోజులుగా ఒంట్లో నీర్సంగా యుంది. అదే పోతుందిలే బాబూ అని అన్నాడు...

తాతా! మరేం దిగులు పడకు. ఈ వృద్ధాప్యంలో కూడ నీ కెవరూ 'నా' అన్నవాళ్ళు లేరు. ఈ విషయాన్ని, నీ మనసులో వుంచుకొని, బాధపడకు. అవసరమేమైనా, వస్తే, నాతో చెప్పు తాతా మరచిపోకు. అని టైం చూసుకున్నాడు...తాతా...ఆఫీసుకు టైము ఔవుతోంది నే వెళ్తాను అంటూ లేచాడు...

మంచిది బాబూ! ... ఇలాచూడు బాబూ, ఆ పాదునవున్న ద్రాక్షపళ్లు కోసి, పట్టుకెళ్లు, అన్నాడు. ఇపుడువద్దు. ఆఫీసు నుండి వచ్చినపుడు పట్టుకెళతాను అని మౌనంగా, గేటుదాటాడు.

'బాబు...అని పిలిచాడు రంగన్న. ప్రకాశం వెనక్కు తిరిగి చూశాడు. తాత యింకా గేటువద్దనే నిలబడియున్నాడు. ఏం తాతా! అని అడిగాడు.

ఏంలేదు బాబూ...ఒక విషయం మరచిపోయాను. ఆ లక్ష్మితో స్నేహం చెయ్యకు. అదంతా మరచిపో. అదొక బీడకల. నీవు యువకుడవు నీ అంతస్తుకు తగిన, యువతిని వివాహం చేసుకొని, కుటుంబ భారాన్ని భరించు బాబూ...ఇంతకన్న నేను చెప్పవలసిందేమీ లేదు. ఈ విధంగా చెప్పానని కించపడకు...వెళ్లు బాబూ...అని తోటలోకి వెళ్ళిపోయాడు...

*                *                *

ప్రకాశం బాబు తన టేబిలుమీద వున్న ఆఫీసు కాగితాలను తలవంచుకొని, పరిశీలిస్తున్నాడు. కొన్ని క్షణాలు గడిచిపోయినాయి. బాబూ...అన్న పిలుపు వినిపించింది. చూసాడు. ఏమటన్నట్లు...

(తరువాయి 85వ పేజీలో)

(83వ పేజీ తరువాయి)

బాబూ...రంగన్న పరిస్థితి ఏమీ బాగులేదు. నిన్నటి నుంచి కొంచెం హెచ్చుగా వుంది బాబూ అని చేతులు కట్టుకొని నిలబడ్డాడు నౌకరు.

సరే...నువ్వెళ్లు అన్నాడు; నౌకరు అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

ప్రకాశంబాబు తలవంచుకొని, ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఉన్నట్టుండి అప్రయత్నంగా, రెండు కన్నీటి బిందువులు టేబిలుమీద వున్న కాగితాలపై పడ్డాయి. తలలో అనేక ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయ్. రంగన్న తాత తనకు బంధువుకాడు. కాని, బంధువు లాగునే, తనను, ఎంతో ఆదరించే ప్రాణం... ఇపుడు...జబ్బు తీవ్ర పరిస్థితి. తాత, చుట్టూ ఆవరించిన ఈ విపరీత పరిస్థితులు...ఇవన్నీ ఆలోచించేసరికి శరీరం ఒక్కసారి జలదరించింది. తాత, ఒంటరిజీవి. నా, అన్నవారెవరూ లేరు...ఏమైనా సరే, సహాయం చెయ్యాలి, అని మనసులోనే నిర్ణయించుకున్నాడు... ఆసాయంకాలం తోటలోకి వెళ్ళాడు. తాత మంచం మీద పడుకొని, మూలుగుతున్నాడు. అది అస్పష్టంగా వినిపిస్తోంది. దగ్గరగా వెళ్ళి మంచంమీద కూర్చున్నాడు.

తాతా...అని నెమ్మదిగా పిలిచాడు...

రంగన్న తలెత్తి చూసాడు. బాబూ...వచ్చావా? అని అన్నాడు.

ఇప్పుడే వచ్చాను తాతా! నీ వంట్లో ఎలావుంది? అని అడిగాడు.

బాగానే యుంది బాబూ అని దీనంగా చెప్పాడు. గొంతు బొంగురుపోయింది...బాబు, దీనిని గ్రహించాడు. విషాదంగా, అలా అనకు తాతా! అని నుదుట మీద చెయ్యివేసి, తాతా, జ్వరం హెచ్చుగా వుంది. యిపుడే డాక్టరును తీసుకొస్తాను అంటూ, తాతా ఎంత చెప్పినా వినకుండా. బయటకు వెళ్ళాడు. కొంత సేపటికి, డాక్టరు వచ్చి, చీటి వ్రాసి యిచ్చి వెళ్లి పోయాడు...

బాబు, ప్రక్కనేయున్న కుర్రవాడు రాముడుతో, 'రాముడూ! తాతను జాగ్రత్తగా మాస్తుండు. అవసరమొస్తే ఏ సంగతి నాకు చెప్పు అని తాతతో వెళ్తున్నానని చెప్పి వెళ్ళిపోయాడు.

వారం రోజులయింది. రానురాను రంగన్న పరిస్థితి మరీ ప్రమాదకరంగా పరిణమించింది. ప్రకాశం అప్పుడపుడు వచ్చి, చూసి, సహాయంచేసి, వెళ్లిపోతున్నాడు. ఆవేళ ఆదివారం. బాబు యింటివద్దే వున్నాడు. అది కాళరాత్రి. 'చీకటి ప్రపంచాన్ని పరిపాలిస్తోందిగా' అన్నట్లు దట్టంగా వ్యాపించింది. ప్రకాశం బాబు పడక కుర్చీలో కూర్చుని, ఆరోజు దినపత్రిక చదువుతున్నాడు. నెమ్మదిగా తలపుతట్టిన చప్పుడయింది. లేచి తలుపు తీసాడు. రాముడు వణుకుతూ నిలబడి వున్నాడు.

ఏం...యింత రాత్రపుడు వచ్చావు. ఎలా వుంది రంగన్న తాతకి, అని అడిగాడు.

బాబూ...రంగన్నకి చాలా ప్రమాదంగా వుంది బాబూ. మిమ్మల్ని తీసుకురమ్మని, మూలుగుతూ చెప్పాడు బాబూ అని కన్నీళ్ళతో తడబడుతూ చెప్పాడు...ప్రకాశం నిలుచున్నపాటునే చకితుడై పోయాడు. కొంచెం తేరుకొని, గదిలోకి వెళ్ళి, లాల్చీ వేసుకొన్నాడు. భ్యాటరీ లైటు చేత్తో పట్టుకొని, తల్లిని లేపాడు. అమ్మా!...రంగన్న తాత పరిస్థితి చాలా ప్రమాదంగా వుందట ఒక్కసారి వెళ్ళివస్తానమ్మా! తలుపులు జాగ్రత్తగా వేసుకో అమ్మా అని చెప్పి తొందరగా తోట చేరుకున్నాడు.

'తోటలో నుండి, సన్నని మూలుగు అస్పష్టంగా వినిపిస్తోంది. నెమ్మదిగా మంచంవద్దకెళ్లి, 'తాతా!...అని పిలిచాడు...

బాబూ...అని తలెత్తి చూసాడు రంగన్న.

'తాతా...అన్నాడు విషాదంగా, కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

బాబూ!...నీవు విచారించకు. చెయ్యవలసిందంతా చేసావు ప్రయోజనం లేకపోయింది. నాయనా!–జరుగనున్నదానికి విచారించి ప్రయోజనంలేదు. బాబూ...ఈ తనువు చాలించేముందు, నిన్ను కళ్ళారా చూడాలని పిలిపించాను అని అన్నాడు. ఇంకా...ఏదో చెప్పాలని ప్రయత్నించాడు కాని,......

గొంతు బొంగురు పోయింది. కళ్ళు, మసకలు కమ్మాయి. ఉండుండి ఉచ్ఛ్వాశ, నిస్వాశాలు భారంగా వదులుతున్నాడు. కొన్ని క్షణాలు,...మౌనం. అంతే తల పక్కకు వ్రాలిపోయింది. అతని ప్రాణవాయువులు, అనంత వాయువుల్లో లీనమయిపోయాయి.

తాతా!...తాతా!...అంటూ, ఆ నిర్జీవమైన శరీరంపైబడి విలపించాడు. ప్రకాశం...లేచి, పిచ్చివాడిలా చుట్టూ కలయచూసాడు. ఆతోట అంతా, నిర్జీవమయిపోయింది. ఒక్క దిక్కులేని దీనుడిపై యింత జాలి, కనికరం చూపినందుకు కృతజ్ఞతగా, చెట్లకొమ్మలు రెపరెపలాడాయి,